సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 2 । మార్చి । 2024

I



సచివాలయ వ్యవస్థతో మెరుగైన పాలన IIలో

గ్రామ సచివాలయ వ్యవస్థతో మంచి పాలన అందుతోందని ఎమ్మెల్యే ధనలక్ష్మి అన్నారు.



పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి IIలో

పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే కోరారు.



శ్రీవారికి వారాంతపు పూజలు

విశాఖ: రుషికొండలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

జెన్‌కో ముందుచూపు

రానున్న వేసవిలో ఎదురయ్యే నీటి ఎద్దడి ప్రభావం విద్యుత్ ఉత్పత్తిపై లేకుండా ఉండేలా జెన్‌కో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. అత్యవసర పరిస్థితుల్లో ఉత్పత్తి చేసేందుకు అవసరమైన నీటిని డుడుమ జలాశయంలో నిల్వ చేస్తూ పొదుపుగా వినియోగిస్తున్నారు.

- జలవిద్యుత్ ఉత్పత్తికి పొదుపుగా నీటి వినియోగం
- ముందస్తుగా డుడుమ జలాశయంలో స్టోరేజీ
- మూడు యూనిట్లలో ఉత్పత్తి నిలిపివేత
- వేసవి దృష్ట్యా పొదుపు చర్యలు



డుడుమ జలాశయంలో జెన్ కో అధికారులు నిల్వ చేసిన నీరు



పూర్తిగా ఎండిపోయిన ఒడిశాకు చెందిన స్పిల్‌వే జలాశయం

ముంచంగిపుట్టు: ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరందించే జోలాపుట్టు జలాశయంలో నీటి మట్టాలు తగ్గుతున్నాయి. వీటికి ఒడిశాలోని వాగులు, గెడ్డలతోపాటు జి.మాడుగుల, పాడేరు, పెదబయలు, హుకుంపేట, ముంచంగిపుట్టు మండలాల మీదుగా ప్రవహించే మత్స్యగెడ్డ నీరు ప్రధాన ఆధారం.

ఒడిశా ప్రభావంతో..

ఒడిశాలో వర్షపాతం ఆశాజనకంగా లేనందున దాని ప్రభావం జోలాపుట్టు జలాశయ నీటి మట్టంపై చూపింది. దీంతో రానున్న వేసవిలో విద్యుత్ కొరత లేకుండా ఉండేందుకు ఇప్పటినుంచి జెన్‌కో అధికారులు ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తున్నారు. ఇప్పుడు విద్యుత్‌కు పెద్దగా డిమాండ్ లేనందున మాచ్‌ఖండ్‌లో ఉత్పత్తిని క్రమేపీ తగ్గిస్తూ వస్తున్నారు.

మూడు యూనిట్లలోనే ఉత్పత్తి

మాచ్‌ఖండ్‌లో ఆరు యూనిట్లు ఉన్నాయి. వీటిలో 1,2,3 యూనిట్లు ఒకొక్కటి గంటకు 17 మెగావాట్లు, 4,5,6 యూనిట్లు ఒకొక్కటి 23 మెగావాట్ల చొప్పున విద్యుత్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. ఇవి పూర్తిగా పనిచేస్తే 120 మెగా వాట్లు ఉత్పత్తి అవుతుంది. భవిష్యత్తులో నీటి అవసరాల దృష్ట్యా విద్యుత్ ఉత్పత్తిని తగ్గించారు. ప్రస్తుతం మూడు యూనిట్లలో ఉత్పత్తి నిలిపివేశారు. మిగతా మూడు యూనిట్ల ద్వారా 57 మెగా వాట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నట్టు జెన్‌కో అధికారవర్గాలు తెలిపాయి.

గతేడాదికన్నా తక్కువగా..

జోలాపుట్టు జలాశయ నీటిమట్టం 2750 అడుగుల కాగా శుక్రవారం నాటికి 2707.40 అడుగులు మాత్రమే ఉంది. గత ఏడాది ఇదే రోజుకు 2732.60 అడుగులు నీటి నిల్వలు ఉండేవి. గత ఏడాదితో పోలిస్తే 25 అడుగుల మేర నీరు తక్కువగా ఉంది. ప్రస్తుతం జోలాపుట్టు జలాశయంలో ఆంధ్రా పరిధి రిజర్వాయర్‌లో మాత్రమే నీరు ఉంది. ఒడిశాకు చెందిన స్పిల్ వే జలాశయం పూర్తిగా ఎండిపోయింది.


వెయ్యి క్యూసెక్కుల విడుదల..

జోలాపుట్టు ప్రాజెక్ట్ నుంచి డుడుమ జలాశయంలోకి రెండు గేట్ల ద్వారా వెయ్యి క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. ఇప్పటివరకు ఉన్న నీటి నిల్వలు మరో నెలరోజుల వరకు విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని జెన్‌కో అధికారులు చెబుతున్నారు.



నీటి పొదుపులో భాగంగా విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసిన యూనిట్లు

డుడుమ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 2,590 అడుగులు కాగా ప్రస్తుతం 2577.20 అడుగుల మేర నీరు ఉంది.



మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం

నీటి నిల్వలు పెరిగితేనే పూర్తిస్థాయిలో ఉత్పత్తి

వేసవి దృష్ట్యా నీటిని పొదుపు చేస్తున్నా ఉత్పత్తికి అవసరమైన స్థాయిలో నీటి నిల్వలు కనిపించడం లేదు. ఇప్పుడున్న నీటితో ఏప్రిల్ మొదటి వారం వరకు ఉత్పత్తి జరిగే అవకాశం కనిపిస్తోంది. వాతావరణ పరిస్థితుల బట్టి వర్షాలు పడి నీటి నిల్వలు పెరిగితే పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుంది.

– ఏపీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎస్ఈ, మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం

న్యూస్‌రీల్

'స్పందన' సమస్యల పరిష్కారం వేగవంతం

- కలెక్టర్ విజయ సునీత ఆదేశం
- గిరిజనుల నుంచి 72 వినతుల స్వీకరణ



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ సునీత, జేసీ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో

సాక్షి,పాడేరు: జగనన్నకు చెబుదాం స్పందనలో ప్రజల నుంచి స్వీకరించిన వినతులకు సంబంధించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ విజయ సునీత అధికారులను ఆదేశించారు.పాడేరు ఐటీడీఏ సమావేశమందిరంలో స్పందన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జేసీ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో అభిషేక్ గిరిజనుల నుంచి 72 వినతులను స్వీకరించారు. తాగునీరు, రహదారులు, అంగన్‌వాడీ కేంద్రాల మంజూరు, భూసమస్యలపై వినతులు అందాయి. డీఆర్వో బి.పద్మావతి, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, గిరిజన సంక్షేమశాఖ ఈఈలు డీవీఆర్ఎం రాజు, కె.వేణుగోపాల్, పీఆర్ ఈఈ లావణ్యకుమార్, డీపీవో కొండలరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డీఎల్‌పీవో కుమార్, ఐటీడీఏ ఏవో హేమలత, పలుశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పీవీటీజీలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం



ఆదివాసీలతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని అర్హులైన పీవీటీజీ కుటుంబాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులను ఆదేశించారు.శుక్రవారం సాయంత్రం ఆయన ఇరడాపల్లి పంచాయతీ దిగుసోలములు, వర్తనాపల్లి గ్రామాలను సందర్శించారు. ఇక్కడ పీవీటీజీ కుటుంబాలతో ఆయన మాట్లాడారు. ఉచిత విద్యుత్‌తో పాటు ఇతర సమస్యలను ఆయన తెలుసుకున్నారు. దిగుసోలములలో ఉచిత విద్యుత్‌కు 22 దరఖాస్తులు రాగా 20 కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. మిగిలిన రెండు ఇళ్లకు కూడా కనెక్షన్లు ఇస్తామని అధికారులు తెలిపారు.అలాగే వర్తనాపల్లిలో నాలుగు కుటుంబాలకు కూడా ఉచిత విద్యుత్ కనెక్షన్లు వెంటనే ఇవ్వాలని పీవో ఆదేశించారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ పంపిణీ సంస్థ ఈఈ సురేష్‌కుమార్, ఏడీ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

వెదురు ఉత్పత్తుల తయారీపై శిక్షణ

రంపచోడవరం: ఏజెన్సీలో గిరిజన యువతకు వెదురు ఆధారిత ఉత్పత్తుల తయారీలో శిక్షణ కొరకు అర్హులనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు.వెదురుతో ఫర్నిచర్, అలంకరణ వస్తువుల తయారీపై రంపచోడవరంలో శిక్షణ ఇస్తామన్నారు. ఐటీడీఏ పరిధిలోని ఏడు మండలాలకు సంబంధించిన వెలుగు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. తొలివిడతలో 30 మందికి శిక్షణ ఇస్తామన్నారు.ఈ నెల 5వ తేదీ లోపు దరఖాస్తులు అందజేయాలని ఆయన సూచించారు.

దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ



దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేస్తున్న జేసీ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: పలు ఉన్నత చదువులు చదువుతున్న నలుగురు దివ్యాంగ విద్యార్థులకు జేసీ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌ఉచితంగా ల్యాప్‌టాప్‌లను శుక్రవారం పంపిణీ చేశారు.విభిన్న ప్రతిభావంతులు,వయోవృద్ధుల సహాయసంస్థ వీటిని మంజూరు చేసింది.ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంస్థ జిల్లా అధికారి మాధవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తొలిరోజు 54,357 మందికి పింఛన్ల పంపిణీ



మినుములూరులో పింఛను అందజేస్తున్న వలంటీర్ మహాలక్ష్మి

సాక్షి,పాడేరు: జిల్లాలోని 22 మండలాల్లో శుక్రవారం వేకువజాము నుంచి సామాజిక పింఛన్లను వలంటీర్లు ఉత్సాహంగా పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 1,28,348 మంది పింఛనుదారుల్లో తొలిరోజు 54, 357మందికి నగదు అందజేశారు. జిల్లాలో అత్యధికంగా కూనవరంలో 67.87 శాతం నమోదైనట్టు అధికారవర్గాలు తెలిపాయి.

ఫిజియోథెరపీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి,పాడేరు: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లాలో నడుస్తున్న పలు భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని డీఈవో బ్రహ్మాజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు పోస్టుకు నెలకు రూ.12వేల వేతనంతో పాటు ప్రతినెలా నిర్వహించే శిబిరానికి అదనంగా రూ. వెయ్యిని ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు.ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు పాడేరులోని పీఎంఆర్‌సీ భవనంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో ఈనెల 4వతేదీ నుంచి దరఖాస్తులు పొంది,11వతేదీ సాయంత్రం ఐదు గంటలలోపు సమర్పించాలని ఆయన కోరారు.

12,457 మందికి జగనన్న విద్యా దీవెన

- తల్లుల ఖాతాల్లో రూ.6.15 కోట్లు జమ
- కలెక్టర్ విజయ సునీత



విద్యాదీవెన నమూనా చెక్కును విద్యార్థుల తల్లులకు అందజేస్తున్న కలెక్టర్ విజయ సునీత



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షిస్తున్న అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు

సాక్షి,పాడేరు: ప్రభుత్వం జగనన్న విద్యాదీవెన పథకంలో జిల్లాలోని 12,457మంది విద్యార్థులకు లబ్ధి చేకూరిందని కలెక్టర్ విజయసునీత తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో త్రైమాసికానికి సంబంధించి జగనన్న విద్యాదీవెన ఆర్థిక సాయంను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణాజిల్లా పామర్రులో బటన్ నొక్కి విడుదల చేశారు.ఈ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని స్థానిక కలెక్టరేట్‌లో అంతా వీక్షించారు. అనంతరం నమూనా చెక్కును విద్యార్థుల తల్లులకు కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిషన్ తదితర కోర్సులు చదువుతున్న జిల్లాలోని 12,457మంది విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన పథకంలో రూ.6కోట్ల 15లక్షల 12వేల 533ను ప్రభుత్వం జమ చేసిందన్నారు. జిల్లాలో 10,327మంది ఎస్టీ విద్యార్థులకు రూ.4కోట్ల 76లక్షల 91వేల 215, ఎస్సీ విద్యార్థులు 339 మందికి, బీసీ విద్యార్థులు 1,319 మందికి, ఈబీసీ 127మంది, కాపు 282 మంది, క్రిస్టియన్ మైనారిటీ 10 మంది, ముస్లిం మైనారిటీ 53మంది విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన పథకంలో నగదు అందుతుందన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు.విద్యతోనే అన్ని రంగాలలో అభివృద్ధి సాధ్యమని గుర్తించిన ప్రభుత్వం పుట్టిన బిడ్డ నుంచి విదేశీ విద్య వరకు వివిధ పథకాల ద్వారా అన్ని విధాల ప్రోత్సహిస్తుందన్నారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు మాట్లాడుతూ జగనన్న విద్యాదీవెనతో తామంతా ఉన్నత విద్యను అభ్యసింగ గలుగుతున్నామని, ప్రభుత్వం అందించే సాయం వల్ల తమ తల్లిదండ్రులకు ఆర్థిక భారం తప్పిందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు రామలక్ష్మి, జంపరంగి లిల్లీ, ఎంపీపీ ఎస్.రత్నకుమారి, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

- చంద్రబాబు హయాంలో పేదలకు అన్యాయం
- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని అర్హులైన పేద గిరిజనులందరికీ ఇళ్ల స్థలాలు ఉచితంగా పంపిణీ చేసి వారికి సొంతింటి కల నెరవేర్చడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్‌లో శుక్రవారం 109 మంది గిరిజనులకు ఆమెతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఇళ్ల నిర్మాణాలకు నవరత్నాల పథకాలలో భాగంగా సంకల్పించిందన్నారు. ప్రభుత్వం విలువైన భూములను కొనుగోలు చేసి ఇంటి స్థలాలుగా పంపిణీ చేయడంతో పాటు భవిష్యత్తులో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలను మంజూరు చేస్తుందన్నారు. గత చంద్రబాబు పాలనలో అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు,ఇళ్ల నిర్మాణాలలో తీవ్ర అన్యాయం జరిగిందని ఆమె విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సెంటున్నర భూమిపై చంద్రబాబు, టీడీపీ నేతలు తప్పుడు ప్రచారం చేయడం దారుణమన్నారు. చంద్రబాబు పాలనలో ఎంతమందికి ఇళ్లస్థలాలు ఉచితంగా ఇచ్చారో ప్రజలకు బహిరంగంగా ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. చంద్రబాబు పాలనలో పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేసి ఉంటే వారంతా ఎందుకు తమ పాలనలో దరఖాస్తు చేసుకుంటారని ఆమె ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాడేరు మార్కెట్ కమిటి చైర్మన్ కూతంగి సూరిబాబు,ఎంపీటీసీలు గిడ్డి విజయలక్ష్మి,రామకృష్ణపాత్రుడు,కుంతూరు నరసింహమూర్తి,మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు,పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు గబ్బాడ చిట్టిబాబు, సర్పంచ్‌లు బసవన్నదొర, వంతాల రాంబాబు, నీలకంఠం, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 92.67 శాతం హాజరు

- ఫస్టియర్ పరీక్షకు 7,191 మంది..
- ఆర్టీసీ ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్న విద్యార్థులు



దట్టమైన పొగమంచులో పాడేరు జూనియర్ కళాశాల సెంటర్‌కు చేరుకున్న విద్యార్థులు



పాడేరు జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల సందడి



పాడేరు జూనియర్ కళాశాల సెంటర్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రమైన పాడేరులో పొగమంచు దట్టంగా కురవడమే కాకుండా చలిగాలులు వీయడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. అయినప్పటికీ సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించింది. జిల్లాలో 27 కేంద్రాల్లో నిర్వహించిన ఫస్టియర్ పరీక్షకు 7759 మంది హాల్ టికెట్ పొందగా, 7,191 మంది పరీక్ష రాయగా 92.67 హాజరు శాతం నమోదైంది. 568 మంది గైర్హాజరయ్యారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల నిఘా మధ్య పరీక్ష నిర్వహించారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు ప్రభుత్వం కల్పించింది. ఇలావుండగా శనివారం జరగనున్న ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 5845 మంది హాల్ టికెట్లు పొందారని ఇంటర్ బోర్డు జిల్లా పర్యవేక్షకుడు వినోద్‌బాబు తెలిపారు.

వైభవంగా శంకు పండగ



గద్దెలపై కొలువైన అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



జాతరకు తరలివచ్చిన గిరిజనులు

- వేల సంఖ్యలో తరలివచ్చిన గిరిజనులు
- గద్దెలపై అమ్మవార్లకు పూజలు

ఎటపాక: రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న మినీ మేడారం మారాయిగూడెం సమ్మక్క, సారక్క జాతర నాల్గవ రోజు శుక్రవారం వైభవంగా జరిగింది. శంకు పండుగ సందర్భంగా గద్దెలపై కొలువైన అమ్మవార్లను దర్శించుకునేందుకు మూడు రాష్ట్రాల సరిహద్దు గ్రామాల నుంచి గిరిజనులు వేల సంఖ్యలో తరలి వచ్చి పూజలు చేశారు. ఇలవేల్పులకు మొక్కులు చెల్లించుకున్నారు. తమ పంటపొలాలు చల్లంగా చూడాలని, పంటలు మంచిగా పండాలని వేడుకుంటూ ఈఏడాది పండిన పంటలను అమ్మవార్లకు కానుకలుగా సమర్పించారు. జాతరకు ప్రభలు, మేళతాళాలతో తరలిరావంతో మారాయిగూడెం జనసంద్రమైంది. సోడి శాంతమ్మ,అచ్చమ్మ దేవరబాలలు అమ్మవార్లకు పూజలు చేశారు.గిరిజన సంప్రదాయ సాంస్కృతిక ,నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా నాగ ప్రసాద్



అవార్డును స్వీకరిస్తున్న సదేల నాగప్రసాద్

అడ్డతీగల: రోల్ మోడల్ స్కూల్స్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా మండలంలోని బడదాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సదేల నాగప్రసాద్ ఎంపికయ్యారు. విదాబోధనలో వినూత్న కార్యక్రమాలు, సేవలను గుర్తించి ఎంపిక చేసినట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం విజయవాడలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రెనింగ్ విభాగం డైరెక్టర్ మస్తానయ్య అవార్డును అందజేశారన్నారు. అవార్డు గ్రహీత నాగప్రసాద్‌ను యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తేజోరావు, సంఘ సభ్యులు, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

తనిఖీలు ముమ్మరం



ముంచంగిపుట్టు నుంచి రూడకోట మార్గంలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రం నుంచి రూడకోట వెళ్లే మార్గంలో శుక్రవారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. స్థానిక ఎస్‌ఐ రవీంద్ర ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు బాంబ్ స్క్వాడ్‌తో కల్వర్టులు, వంతెనలు క్షుణ్ణంగా పరిశీలించారు. పెద్దపుట్టు జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల బ్యాగులు, లగేజీలు తనిఖీలు చేశారు. అనుమానితుల వివరాలు తెలుసుకుని విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రవీంద్ర మాట్లాడుతూ రానున్న ఎన్నికల దృష్ట్యా ముందస్తు చర్యలో భాగంగా తనిఖీలు ముమ్మరం చేశామని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండల కేంద్రానికి రాకపోకలు చేసే వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. రాత్రి వేళలో ప్రభుత్వ కార్యలయాల వద్ద గస్తీ నిర్వహిస్తామని తెలిపారు.ఈ తనిఖీల్లో సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

పడవ రేవు వేలం రూ.80 లక్షలకు ఖరారు

కూనవరం: కూనవరం, రుద్రమకోట మధ్య గోదావరి పడవ రేవు వేలం వేలంపాట రికార్డు స్థాయిలో రూ. 80 లక్షలకు ఖరారైంది. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పడవ రేవు వేలంలో కూనవరం, వీఆర్‌పురం, వెలేరుపాడు మండలాలకు చెందిన 16 మంది పాటదారులు పాల్గొన్నారు. ఎక్కువ మొత్తంలో పాట పాడిన వాళ్ల బాపూజీరెడ్డికి అధికారులు వేలం ఖరారుచేశారు. ఇదిలాఉండగా గత ఏడాది కేవలం రూ. 36,03 లక్షలు మాత్రమే వేలం రూపంలో ఆదాయం వచ్చింది. ఒకరికి రూ.40, మోటార్ సైకిల్‌కు రూ.50 చొప్పున వసూలు చేయాలని,లైఫ్ జాకెట్లు ఉండాలని అధికారులు పాటదారుడికి సూచించారు. ఎంపీపీ పాయం రంగమ్మ, కూనవరం, వెలేరుపాడు ఎంపీడీవోలు ఈ.ప్రేమసాగర్, శ్రీహరి, ఈవోఆర్డీ రామాంజనేయ ప్రసాద్ కూనవరం, రుద్రమకోట సర్పంచ్‌లు మల్లంపల్లి హేమంత్, నాగం పల్లి స్వర్ణలత, ఎంపీటీసీలు కొవ్మాని అనంతలక్ష్మి, బండారు సాంబశివ రావు, కోమరాజు రాంబాబు ఆర్ఐ జల్లి సత్యనారా యణ, వీఆర్వో వెంకన్న, కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.



IIలో

సహజసిద్ధమైన అందాలకు నిలయమైన భీమిలి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం పరవళ్లు తొక్కుతోంది. రూ.2 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టగా, వివిధ సంక్షేమ పథకాల ద్వారా మరో రూ.2,550 కోట్ల మేర లబ్ధి చేకూరింది. ప్రధానమైన చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికుల సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపింది. యాజమాన్యం నుంచి రూ.33 కోట్లకు పైగా పరిహారం ఇప్పించింది.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలోని జీరో నుంచి ఐదు సంవత్సరాలలోపు చిన్నపిల్లల అందరికీ పోలియో చుక్కల మందు వేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే సూచించారు. ఈ నెల మూడు నుంచి ఐదో తేదీ వరకు పోలియో చుక్కల కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆయన స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఈనెల 3వ తేదీన నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమానికి ఏడు మండలాల్లో 19,815 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు 576 కేంద్రాలు,72 రూట్లలో 25 మొబైల్ టీంలను ఏర్పాటుచేసినట్టు తెలిపారు. ఏజెన్సీ వైద్యా ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ప్రకాశం, వైద్యాధికారులు శిరీష, వినోద్ కుమార్, ఎంపీహెచ్‌వో పీటర్ పాల్గొన్నారు.

ప్రగతి పరవళ్లు

ఐదేళ్లలో రూపురేఖలు మారిన భీమిలి



వేములవలసలో ఒకే చోట గ్రామ సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్



మట్టి వాసనతో చక్కటి గ్రామీణం.. ఆధునిక పోకడలతో అందమైన పట్టణం.. ఇదే భీమిలి నియోజకవర్గం. చరిత్రలో భీమిలి పేరు సువర్ణాక్షరాలతో లిఖితమైంది.

భీమిలి నియోజకవర్గంలో 1952 నుంచి 2019 వరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. ఈ నియోజకవర్గంలో 2019 వరకు 67 ఏళ్ల కాలంలో వివిధ పార్టీల హయాంలో జరిగిన అభివృద్ధి కంటే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత 2019–2024 మధ్య కాలంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టింది. 33కు పైగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా రూ.2550 కోట్ల వరకు లబ్ధి చేకూరింది. ఐదు లక్షల పైగా జనాభా కలిగిన అతి పెద్ద నియోజకవర్గం భీమిలిలో అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి ఈ మొత్తం జమ అయింది. మరో రూ.2వేల కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి.

– తగరపువలస

- ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో రెండు చక్రాలుగా అభివృద్ధి, సంక్షేమం
- రూ.2వేల కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాల ద్వారా రూ.2,550 కోట్ల లబ్ధి
- కొత్తగా సమకూరిన మౌలిక సదుపాయాలు
- దీర్ఘకాలిక సమస్యలకూ పరిష్కారం

పార్కులు భళా

ప్రజలకు ఆహ్లాదం కలిగించేందుకు గానూ పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చారు. మధురవాడ జోన్‌లో రూ.6 కోట్లతో మూడు చోట్ల థీమ్ పార్కులను అందుబాటులోకి తీసుకొచ్చారు. భీమిలి జమ్మి చెరువు పార్కును రూ.84లక్షలు, బీచ్ పార్కును రూ.25 లక్షలతో ఆధునికీకరించారు. జీవీఎంసీ భీమిలి జోన్‌లోని 1 నుంచి 4 వార్డులకు కలిపి 182 పనులకు రూ.34.59 కోట్లు ఖర్చు చేశారు. మధురవాడ జోన్‌లోని 5 నుంచి 8 వార్డులకు గానూ 492 పనులు మంజూరు కాగా.. రోడ్లు, డ్రైయినేజీలు, శ్మశానవాటికలు, ప్రహరీలు, రక్షణగోడలు, బస్ షెల్టర్లు, ఫుట్‌పాత్‌లకు 108.44 కోట్లు ఖర్చు చేశారు.



భీమిలి జమ్మి చెరువు పార్కు

శ్మశానవాటికలకు కొత్త రూపు

శ్మశానవాటికలను కూడా నందనవనంలా తీర్చిదిద్దుతున్నారు. ప్రహరీలు నిర్మించి వసతులు కల్పిస్తున్నారు. ఇటీవల భీమిలి జోన్‌లో రూ.1.09 కోట్లతో నాలుగు శ్మశానవాటికల్లో వసతులు పూర్తి చేశారు.

47 సచివాలయాలు.. 45 ఆర్బీకేలు

స్వపరిపాలనలో భాగంగా రూ.14.95 కోట్లతో 47 గ్రామ సచివాలయాలు, రూ.9.81 కోట్లతో 45 రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు. భీమిలిలో రూ.75 లక్షలతో డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను రైతుల ప్రయోజనార్థం ఏర్పాటు చేశారు. మధురవాడ జోన్‌లో వసంత విహార నుంచి జీసీసీ లే అవుట్ వరకు రూ.3 కోట్లతో, సాండ్ అండ్ సాండ్ లే అవుట్ నుంచి బక్కన్నపాలెం వరకు రూ.1.40 కోట్లతో డ్రైనేజీ నిర్మించారు. కాపులుప్పాడలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో రూ.4 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో 2వేల మెట్రిక్ టన్నుల కెపాసిటీ కలిగిన గొడౌన్‌ను రూ.1.20 కోట్లతో నిర్మించారు.



మద్ది ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్

ఆరోగ్య భద్రతకు పెద్దపీట

రూ.3.60 కోట్లతో భీమిలిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆధునికీకరించారు. రూ.8.21కోట్లతో 8 పట్టణ ఆరోగ్య కేంద్రాలు నిర్మించి, 3 పీహెచ్‌సీలతో పాటు మరో 4 పీహెచ్‌సీలను రూ.2.68 కోట్లతో ఆధునికీకరించారు.గ్రామీణ ప్రాంతాల్లో రూ.6.3 కోట్లతో 36 విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు నిర్మించారు. నాడు–నేడు కింద 247 పాఠశాలల్లో అదనపు గదులు, ప్రహరీల నిర్మాణం, 58 అంగన్‌వాడీ భవనాలు నిర్మించారు.

సొంతింటి కల నెరవేరిందిలా..

నియోజకర్గంలో 35 వేల మందికి ఇంటి పట్టాలు అందించారు. వీటి మార్కెట్ విలువే రూ.10.50 కోట్లపైనే ఉంటుంది. జగనన్న కాలనీల్లో విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలకు అదనంగా ఖర్చు చేశారు. ఇంకా ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల చొప్పున రుణసాయం అందిస్తున్నారు. ఇప్పటి వరకు 534 మందికి టిడ్కో ఇళ్లు అందించారు. మిగిలినవి పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశారు.



ఒక్కొక్కరికి రూ.లక్ష పైనే లబ్ధి

నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికీ సగటున సంక్షేమ పథకాల ద్వారా రూ.51,008, ఓటర్‌కు రూ.101,008 లబ్ధి చేకూరగా.. అభివృద్ధి పనులతో కలిపి ఒక్కొక్కరికి రూ.72,305, ఓటర్‌కు రూ.143181 ప్రయోజనం చేకూరింది.

జ్యూట్ మిల్లు కార్మికులకు రూ.33 కోట్ల పరిహారం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భీమిలి డివిజన్‌లో ప్రజలకు అందుబాటులో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేశారు. 2009లో చిట్టివలస జ్యూట్‌మిల్లు లాకౌట్‌కు గురి కాగా.. అప్పటి కాంగ్రెస్, తర్వాత వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వాలు ఈ సమస్యను పరిష్కరించలేకపోయాయి. 2019లో వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జోక్యంతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆరు వేల మంది కార్మికులకు పరిష్కారం చూపారు. ఇప్పటివరకు యాజమాన్యం నుంచి రూ.33 కోట్లకు పైగా పరిహారం ఇప్పించారు. నాలుగు దశాబ్దాల ప్రజల కలను నెరవేర్చేలా రూ.78 లక్షలతో చిట్టివలసలో రైతు బజార్‌ను నిర్మించారు. సత్యనారాయణపేట కొండవాలు ప్రాంతంలో రూ.74 లక్షలతో రక్షణ గోడ ఏర్పాటు చేయించారు. భీమిలి జోన్ ప్రజల తాగునీటి సమస్య తీర్చడానికి రూ.1.27కోట్లతో 350 ఎంఎం పైప్‌లైన్ నిర్మించారు. తొట్లకొండపై రూ.1.50 కోట్లతో మహా స్తూపం పునర్ నిర్మాణం, వసతులు కల్పించారు.

చకచకా రోడ్ల విస్తరణ

గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ప్రభుత్వం ప్రతీ సచివాలయం పరిధిలో రూ.20 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. పద్మనాభం నుంచి రెడ్డిపల్లి శాంతినికేతన్ వరకు రూ.10.40 కోట్లతో మూడు కిలోమీటర్ల మేరకు రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నాయి. భీమిలి అర్బన్, రూరల్ ప్రాంతాలు కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లు, బీటీ రోడ్లతో కళకళలాడుతున్నాయి. జీ–20 సదస్సు సందర్భంగా భీమిలి బీచ్‌రోడ్లకు కొత్త అందాలు వచ్చి వెలిగిపోతున్నాయి. ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సిగ్నలింగ్ వ్యవస్థ ద్వారా ఆధునికీకరించారు.



కాపులుప్పాడ దంపింగ్‌యార్డుకు రహదారి

రోడ్డు ప్రమాదంలో గిరిజనుడు మృతి

అరకులోయటౌన్: మండలంలోని తడక–ఇరుగాయి రహదారిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గిరిజనుడు మృతి చెందాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇరగాయి నుంచి తడక గ్రామానికి ద్విచక్ర వాహనంపై పాంగి రాజు(31) వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో సంఘటన స్థలంలోనే రాజు మృతి చెందాడు. మృతుడికి భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు. ఢీ కొట్టిన మరో వాహనదారుడు ఆచూకీ తెలియాల్సి ఉంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



రాజు మృతదేహం

ఆటో బోల్తా: డ్రైవర్‌కు గాయాలు

చింతపల్లిరూరల్: ఆటో బోల్తా పడి డ్రైవర్‌కి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో కొమ్మంగి సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం లోతుగెడ్డ జంక్షన్ నుంచి కొమ్మంగి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో కొండ ప్రాంతమైన ఎగువకు వెళ్లలేక అక్కడే దించేశాడు. ఖాళీ ఆటో ఎగువ రోడ్డుకి వెళ్తున్న సమయంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ కాశీబాబుకి గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి వేరే ఆటోలో చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించగా, వైద్యులు ప్రథమ చికిత్స అందించారు.



చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్

ఆర్గానిక్ ఆహార పదార్థాలతో ఆరోగ్యం

రంపచోడవరం: ప్రస్తుతం ఆర్గానిక్ ఉత్పత్తులకు మార్కెట్ మంచి గిరాకీ ఉందని, ఆయా ఆహార పదార్థాలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం లో శుక్రవారం వ్యవసాయ, ఉద్యాన అధికారులు, అగ్రి కల్చర్, హార్టీకల్చర్ అసిస్టెంట్లుతో తాటి నీరా, తాటి బెల్లం, పనస పండ్లతో ఆహార పదార్థాల తయారీ, మార్కెటింగ్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాటిచెట్లతో సేకరించిన నీరాను కొనుగోలు చేసి, వాటి ద్వారా తాటిబెల్లం తదితర ఉత్పత్తులను కేవీకేలో తయారు చేసి మార్కెటింగ్ చేయవచ్చన్నారు. లీటరు తాటి నీరా రూ.25లకు కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. రోజుకు 500 లీటర్ల నీరాను కేవీకేలో విక్రయించుకోవచ్చన్నారు. తాటి నీరా ద్వారా తయారు చేసిన తాటి బెల్లం రక్తహీనత ఉన్నవారికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పనస పండు, కర్ర పెండలంతో తయారుచేసిన ఆహార పదార్థాలను చెన్నై నుంచి వేర్వేరు దేశాలకు ఎగుమతి చేస్తున్నారన్నారు. పనస, కర్ర పెండలంతో వివిధ రకాలైన ఆహార పదార్థాలను తయారు చేయవచ్చన్నారు. అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన యువతకు చిన్న చిన్న యూనిట్ల ఏర్పాటుతో ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్ర కోఆర్డినేటర్ లలిత కామేశ్వరి, కెవికె సీనియర్ సైంటిస్టులు కె. రాజేంద్రప్రసాద్, పి సి.వెంగయ్య, పీహెచ్‌వో కె.చిట్టిబాబు, పీఏవో ఎల్.రాంబాబు, ఏడీఏ సీహెచ్‌కె వి.చౌదరి, యం.సావిత్రి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నీరా, తాటి బెల్లం తయారీ ప్లాంట్‌ను వ్యవసాయ శాఖ అధికారులు, హార్టీకల్చర్ అసిస్టెంట్లు, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు సందర్శించారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

సచివాలయ వ్యవస్థతో మెరుగైన పాలన

ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు

అడ్డతీగల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన పాలన అందుతుందని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు.అడ్డతీగల మండలం ఎల్లవరం, వీరవరం, రాయపల్లి గ్రామాల్లోని గ్రామ సచివాలయ భవనాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన పాలనకు తెరతీశారన్నారు. ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు పారదర్శకంగా అందించాలనే ఉద్దేశంతోనే గ్రామ సచివాలయ, గ్రామ వలంటీర్ వ్యవస్థలను అమలు చేస్తున్నారన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ వల్ల ప్రజలు అధికారులతో సమన్వయం కావడానికి మరింత అవకాశం ఏర్పడిందన్నారు. రాష్ట్ర రోడ్డు డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల సత్యనారాయణ,ఎంపీపీ బొడ్డపాటి రాఘవ,మండల జెసిఎస్ కన్వినర్ నక్కా మోహన్,జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కారు రాంబాబు,పలువురు ఎంపీటీసీలు,సర్పంచ్‌లు,వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

గుణుపూర్ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: నౌపడ–పర్లాకిమిడి సెక్షన్ మధ్య జరుగుతున్న పలు ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే విశాఖపట్నం–గుణుపూర్ పాసింజర్ స్పెషల్ రైలు ఆది, బుధవారాలలో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం–గుణుపూర్–విశాఖపట్నం 08522/08521) పాసింజర్ స్పెషల్ ఈ నెల 3,6,10,13,17, 20,24,27,31 తేదీల్లో ఇరువైపులా రద్దయిందన్నారు.

గ్రామస్థాయిలో మెరుగైన వైద్యసేవలు

గంగవరం : గ్రామ స్థాయిలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తున్నారని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా టాస్క్ ఫోర్స్ టీమ్ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ సతీష్, జిల్లా స్టాటికల్ అధికారి జె.కైలాస్ అన్నారు. గురువారం సాయంత్రం వారి ఆధ్వర్యంలో జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం మండలంలో పర్యటించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలను పరిశీలించింది. దీనిలో భాగంగా పిడతమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మొల్లేరు ఆరోగ్య ఉప కేంద్రాన్ని బృందం సందర్శించింది. ఏఎన్ఎం, ఎల్‌హెచ్‌వీవో, ఆశా కార్యకర్తలు రికార్డులు పరిశీలించారు. మొల్లేరు ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో గర్భవతులు, బాలింతలు, చిన్న పిల్లలకు అందించిన సేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డివిజన్ ప్రోగ్రాం అధికారులు సంజీవి, లక్ష్మి, పిడతమామిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిరతన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మొల్లేరు సబ్‌సెంటర్‌ను సందర్శించిన జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం సభ్యులు

ఉపాధి అవకాశాలపై అవగాహన అవసరం

జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు

సాక్షి,పాడేరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చదువుతో పాటు ఉపాధి అవకాశాలపై అవగాహన పొంది భవిష్యత్తులో పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీ రావు కోరారు. స్థానిక తలారిసింగి పాఠశాలలో ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను శుక్రవారం నిర్వహించారు. జిల్లాలోని ఎనిమిది పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరిశ్రమలకు సంబంధించిన నమూనాలను ప్రదర్శించారు. వీటిని పరిశీలించిన డీఈవో వారిని అభినందించారు. మొదటి బహుమతి జోలాపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, ద్వితీయ బహుమతి రాజవొమ్మంగి మండలం సింగంపల్లి జడ్డంగి గిరిజన సంక్షేమ పాఠశాలకు లభించాయి.ఈ రెండు ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపికచేసినట్టు డీఈవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జ్యూరీ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, రామారావు,శర్మ, ఎండీపీ చెల్లయ్య, జోనల్ మేనేజర్ చాగంటి బ్రహ్మం, ఎంఈవో రామచంద్రరావు పాల్గొన్నారు.



ప్రాజెక్టు నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులతో డీఈవో బ్రహ్మాజీరావు, ఉపాధ్యాయులు